https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 41 గురువారం 4-06-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా? అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను... మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు 9989788438, 9505485656.

# ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం

- ఇరవై ఒక్క మంది మృతి
- మంటల్లో చిక్కుకున్న విదేశీయులు
- సహాయక చర్యలు కొనసాగింపు








**న్యూఢిల్లీ, జూన్ 3**

దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం జరిగిన ఘోర అగ్నిప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. దక్షిణ ఢిల్లీలోని మాలవీయ నగర్ ప్రాంతంలో ఉన్న ఓ భవనంలో చెలరేగిన మంటల కారణంగా కనీసం ఇరవై ఒక్క మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. మృతుల్లో విదేశీ పౌరులు కూడా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాలవీయ నగర్ ప్రాంతంలోని భవనం దిగువ అంతస్తులో ఉన్న భోజనశాలలో ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. అక్కడ ప్రారంభమైన మంటలు వేగంగా పై అంతస్తులకు వ్యాపించాయి. భవనంలో బస చేస్తున్న వారు ఒక్కసారిగా మంటలు, దట్టమైన పొగతో చిక్కుకుపోయారు. ప్రమాదం సంభవించిన సమయంలో పలువురు నిద్రలో ఉన్నట్లు తెలుస్తోంది. మంటల తీవ్రత పెరగడంతో ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు పై అంతస్తుల నుంచి కిందకు దూకారు. స్థానికులు వెంటనే స్పందించి రహదారిపై పరుపులు ఏర్పాటు చేసి వారిని రక్షించేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఎనిమిది అగ్నిమాపక వాహనాలతో మంటలను అదుపులోకి తెచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఇతర అత్యవసర బృందాలు కలిసి నలభై మందికి పైగా బాధితులను రక్షించి సమీప ఆసుపత్రులకు తరలించాయి. పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ భవనం విదేశాల నుంచి వైద్య చికిత్సల కోసం వచ్చిన వారు ఎక్కువగా బస చేసే కేంద్రంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఆఫ్రికా, మధ్య ఆసియా దేశాలకు చెందిన పలువురు అక్కడ నివసిస్తున్నట్లు వెల్లడైంది. మృతుల్లో కూడా విదేశీయులు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం వెలువడింది. అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. భోజనశాలలోనే మంటలు ప్రారంభమై ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు.

# తెలంగాణ-దక్షిణాఫ్రికా కొత్త బంధం

## నైపుణ్య రంగంలో భాగస్వామ్యం
## వైద్య పర్యాటకానికి కొత్త ఊతం
## పెట్టుబడులపై పరస్పర ఆసక్తి



**హైదరాబాద్, జూన్ 3**

తెలంగాణ రాష్ట్రం, దక్షిణాఫ్రికా మధ్య విద్య, నైపుణ్యాభివృద్ధి, వైద్య పర్యాటకం, పెట్టుబడుల రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరు పక్షాలు పరస్పర ప్రయోజనాల దిశగా కలిసి పనిచేయాలని అంగీకరించాయి. సమావేశంలో ముఖ్యమంత్రి హైదరాబాద్‌ను విద్య, నైపుణ్య శిక్షణ, సాంకేతిక రంగాలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్న విధానాన్ని వివరించారు. సమాచార సాంకేతికం, ఔషధ తయారీ, రక్షణ, అంతరిక్ష రంగాలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తెలంగాణ అందిస్తోందని తెలిపారు. ప్రపంచంలోని ప్రముఖ సంస్థల సామర్థ్య కేంద్రాలు హైదరాబాద్‌లో ఏర్పాటవుతున్నాయని, ఇది రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఆధునిక వైద్య సేవలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయని ముఖ్యమంత్రి వివరించారు. తక్కువ వ్యయంతో నాణ్యమైన వైద్య చికిత్సలు అందుబాటులో ఉండటంతో అనేక దేశాల ప్రజలు నగరానికి వస్తున్నారని చెప్పారు. నైపుణ్య మానవ వనరుల కేంద్రంగా, వైద్య పర్యాటక కేంద్రంగా హైదరాబాద్‌ను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వెల్లడించారు. ఈ ఏడాది డిసెంబరులో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుకు దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు హాజరుకావాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. గత ఏడాది నిర్వహించిన సదస్సు అపూర్వ విజయాన్ని సాధించిందని, ప్రపంచవ్యాప్తంగా ప్రముఖులు పాల్గొన్నారని గుర్తు చేశారు. దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే ఈ ఆహ్వానాన్ని స్వాగతిస్తూ ప్రతినిధి బృందంతో కలిసి హాజరయ్యేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ముప్పై వేల ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న భారత భవిష్య నగర ప్రణాళికను కూడా ముఖ్యమంత్రి వివరించారు. శూన్య కాలుష్య లక్ష్యంతో అంతర్జాతీయ ప్రమాణాల మౌలిక వసతులు కలిగిన ఆధునిక నగరంగా దీన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే మాట్లాడుతూ భారత్, దక్షిణాఫ్రికా దేశాల మధ్య చారిత్రక సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఆఫ్రికా ఖండంలోని విస్తృత మార్కెట్లకు భారత సంస్థలకు దక్షిణాఫ్రికా ఒక ముఖ్య ద్వారంగా నిలుస్తుందని చెప్పారు. ముఖ్యంగా ఔషధ పరిశ్రమలకు భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొంటూ, ఇరు ప్రాంతాల మధ్య ఆర్థిక, పారిశ్రామిక సహకారం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రష్యా నుంచి భారత్‌కు చేరిన నాల్గవ
# సుదర్శన్ ఎస్-400 స్క్వాడ్రన్



**న్యూఢిల్లీ,జూన్ 3**

రష్యా నుంచి ఎస్-400 సుదర్శన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టం నాల్గవ స్క్వాడ్రన్ భారత్‌కు చేరుకుంది. దీంతో భారత గగనతల రక్షణ మరింత బలోపేతం కానుంది. ఎస్-400 సుదర్శన్ సుదీర్ఘ శ్రేణి ఎయిర్‌డిఫెన్స్ సిస్టం రష్యా నుంచి నౌకలో భారత్‌కు వచ్చినట్టు రక్షణ శాఖ వర్గాలు బుధవారంనాడు తెలిపాయి. త్వరలోనే ఆపరేషన్ ఏరియాలో దీనిని మోహరించనున్నట్టు వెల్లడించాయి. భారత్ 2018లో రూ.35,000 కోట్లతో 5 స్క్వాడ్రన్ల కొనుగోలుకు రష్యాతో ఒప్పందం చేసుకుంది. ఇందులో 3 స్క్వాడ్రన్లను రెండేళ్ల క్రితమే భారత్ అందుకుంది. నాల్గవది తాజాగా భారత్ చేరుకుంది. మరి కొద్ది నెలల్లోనే 5వ స్క్వాడ్రన్ కూడా భారత్‌కు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ జరిపిన డ్రోన్, క్షిపణులను ఎస్-400 సుదర్శన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ అత్యంత సమర్ధవంతంగా కూల్చివేసింది. ఏకకాలంలో 300 లక్ష్యాలను ట్రాక్ చేసి, 40 నుంచి 400 కిలోమీటర్ల దూరంలోని శత్రు క్షిపణులను, డ్రోన్లు, స్టెల్త్ ఫైటర్ జెట్‌లను ఈ ఎయిర్ డిఫెన్స్ సిస్టం సమర్ధవంతంగా తిప్పికొట్టగలదు. కాగా, భారత్ సైతం రష్యా సిస్టమ్ తరహాలోనే శత్రువిమానాలను కుప్పకూల్చే డిఫెన్స్ సిస్టమ్ 'కుషా'ను స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేస్తోంది. దీని అభివృద్ధి, ఉత్పత్తిలో భాగస్వామిగా ఇండియన్ డిఫెన్స్ మేజర్ సోలార్ ఇండస్ట్రీలు భాగస్వామిగా వ్యవహరిస్తున్నాయి. రష్యా నుంచి ప్రస్తుతం అందుకున్న ఎస్-400 సుదర్శన్ ఎయిర్ డిఫెన్స్‌ను పశ్చిమబెంగాల్‌లో మోహరించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

## విద్వేషాలు దేశానికి
# శ్రేయస్కరం కాదు

### ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**అమరావతి, జూన్03:**

'తెలంగాణ భారతదేశంలో అంతర్భాగం. ఎవరైనా అక్కడకు వెళ్ళవచ్చు, ఆస్పత్రిలో చూపించుకోవచ్చు. హద్దులకు ఫెన్సింగ్‌లు వేస్తారేమో కానీ, మనుషుల మనసులకు వేయలేరు కదా!' అని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అమరావతిలో పర్యటించిన ఆయన.. అక్కడి 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం కోరుకోవడం వేరని, కానీ తెలుగువారి కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఎప్పుడూ వేరే రాష్ట్రం వారు రాకూడదని చెప్పలేదని గుర్తుచేశారు. తెలంగాణలో ఆంధ్రా కాంట్రాక్టర్లు, ఏపీలో తెలంగాణ కాంట్రాక్టర్లు పనులు చేసుకుంటున్నప్పుడు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం ఎందుకని పవన్ ప్రశ్నించారు. పుష్కర కాలం తర్వాత కూడా ఇంత ద్వేషం ఉంటుందని తాను అనుకోలేదన్నారు. 'హైదరాబాద్ నా ఇల్లు, నా పార్టీ అక్కడే ఆవిర్భవించింది. అక్కడికి వెళ్ళడానికి ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం నాకు లేదు. తెలంగాణలో పుట్టిన భూమి పుత్రులు సభలు పెట్టుకుంటే తప్పేంటి?'అని నిలదీశారు. ఈ వివాదం చినికి చినికి గాలివాన అయిందే తప్ప దీని వెనుక ఎలాంటి కుట్ర లేదన్నారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్‌తో తనకు సోదర సమాన బంధం ఉందని, ఆయన తప్పుగా మాట్లాడి ఉండరని అభిప్రాయపడ్డారు. అలాగే ఈ వ్యవహారంలో సీఎం రేవంత్ రెడ్డి పాత్ర కూడా ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీలోని కొంతమంది నేతలే పనిగట్టుకుని ఇలాంటి విద్వేషాలు రేపుతున్నారని పవన్ మండిప డ్డారు. కాంగ్రెస్ నాయకులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి పోటీ చేయవచ్చు కానీ, తాము వస్తే బెదిరిస్తారా అని ప్రశ్నించారు.

# 114 రఫేల్స్ కావాలి!

## ఫ్రాన్స్‌కు ఎల్‌వోఆర్ జారీ చేసిన భారత్
## ఒప్పందంపై చర్చించేందుకు ఫ్రాన్స్ వెళ్లిన ఐఏఎఫ్ చీఫ్
## రక్షణ రంగం బలోపేతం దిశగా కీలక ముందడుగు



**న్యూఢిల్లీ, జూన్ 2:**

భారత రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక ముందుడుగు పడింది. భారత వాయుసేన (ఐఏఎఫ్) కోసం 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి రక్షణ శాఖ ఫ్రాన్స్‌కు అధికారికంగా అభ్యర్థన పత్రం (లెటర్ ఆఫ్ రిక్వెస్ట్) జారీ చేసింది. సుమారు రూ.3.25 లక్షల కోట్ల విలువైన ఈ రక్షణ ఒప్పందం కోసం రక్షణ శాఖకు చెందిన సేకరణ విభాగం గతవారం ఈ అభ్యర్థన పత్రాన్ని సమర్పించినట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ భారీ డీల్‌పై చర్చించేందుకు వైమానిక దళాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ సోమవారం ఫ్రాన్స్‌కు చేరుకున్నారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఆయన ప్రతిపాదిత ఒప్పందంపై చర్చించడంతోపాటు రఫేల్ యుద్ధ విమానాల తయారీ సంస్థ దసో ఏవియేషన్ ప్లాంట్‌ను సందర్శించే అవకాశం ఉంది. ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ పర్యటన అనంతరం ఈ నెలలోనే ప్రధాని మోదీ కూడా ఫ్రాన్స్ పర్యటనకు వెళ్లే అవకాశం ఉంది. ఈ సందర్భంగా రఫేల్ ఒప్పందం చర్చకు వచ్చే అవకాశం ఉంది. కాగా, భారత్ సమర్పించిన లెటర్ ఆఫ్ రిక్వెస్ట్ (ఎల్‌వోఆర్)ను ఫ్రాన్స్ పరిశీలించి దానిపై 2-3 నెలల్లో స్పందించే అవకాశం ఉంది. అందులో ధర, ఉత్పత్తి సామర్థ్యం, లాజిస్టిక్స్ సపోర్ట్ వంటి అంశాలను వెల్లడిస్తుంది. ధర, ఇతర అంశాలపై తుది చర్చల అనంతరం ఈ ఏడాది చివరినాటికి ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. ప్రతిపాదిత ఒప్పందం ప్రకారం.. మేకిన్ ఇండియా కార్యక్రమం కింద ఫ్రాన్స్‌కు చెందిన దసో ఏవియేషన్ ఒక భారతీయ సంస్థతో కలిసి 90 నుంచి 94 రఫేల్ యుద్ధ విమానాలను భారత్‌లోనే తయారు చేయాల్సి ఉంటుంది. మిగిలిన విమానాలను మాత్రం దసో ఏవియేషన్ ఫ్రాన్స్‌లోనే తయారుచేసి వాటిని ఎగిరే స్థితిలో భారత్‌కు అందజేస్తుంది. 114 రఫేల్స్ ఒప్పందంతోపాటు.. విమాన వాహక యుద్ధనౌకల కోసం భారత నౌకాదళం దసో ఏవియేషన్ నుంచి ప్రత్యేకంగా రూపొందించిన 26 రఫేల్ మెరైన్ యుద్ధ విమానాలను సేకరించనుంది.

## కాంగ్రెస్‌కు రాజ్యసభ సీటు
# కేటాయించిన విజయ్ టీవీకే




**చెన్నై:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం తమ కీలక భాగస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్‌కు రాజ్యసభ స్థానం కేటాయించింది. తమిళనాడు నుంచి రాజ్యసభ స్థానానికి జూన్ 18న ఎన్నిక జరుగనుంది. కాంగ్రెస్‌కు రాజ్యసభ సీటును కేటాయించిన విషయాన్ని ముఖ్యమంత్రి విజయ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. 'ఈనెల 18న తమిళనాడులో రాజ్యసభకు ఎన్నిక జరుగనుంది. ఆ రాజ్యసభ సీటును మా భాగస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్‌కు కేటాయించాలని టీవీకే నిర్ణయం తీసుకుంది' అని విజయ్ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మైలం నియోజకవర్గం నుంచి ఎన్నికైన రాష్ట్ర మాజీ మంత్రి సీవీ షణ్ముగం తన రాజ్యసభ స్థానానికి మే 7న రాజీనామా చేశారు. దీంతో ఆ స్థానానికి ఎన్నిక జరుగుతోంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జూన్ 8వ తేదీ వరకూ రిటర్నింగ్ అధికారి ముందు నామినేషన్లు దాఖలు చేసుకోవలసి ఉంటుంది.

# బంజరకుంట చెట్లే చిచ్చుపెట్టాయా?

**ముత్యంపేటలో సర్పంచ్‌పై దాడి యత్నం ఆరోపణలు**

**చెట్ల వేలంపాటపై రెండు వర్గాల మధ్య వివాదం.. గ్రామంలో ఉద్రిక్తత**




**ప్రెస్ క్లబ్ ముందు వివరాలు వెల్లడిస్తున్న దృశ్యం**

**దౌల్తాబాద్, జూన్ 3**

దౌల్తాబాద్ మండలం ముత్యంపేట గ్రామంలో బంజర కుంటలోని చెట్ల నరికివేత వ్యవహారం గ్రామ రాజకీయాల్లో ఉద్రిక్తతకు దారితీసింది. చెట్ల విక్రయం, నరికివేత అంశంపై రెండు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోగా, గ్రామ సర్పంచ్ తోడంగి సునీత, ఆమె భర్త స్వామిపై దాడి యత్నం జరిగిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడం కలకలం రేపింది.సర్పంచ్ సునీత తెలిపిన వివరాల ప్రకారం, గ్రామంలోని బంజర కుంటలో ఉన్న చెట్లను తొలగించేందుకు ఇరిగేషన్, అటవీ శాఖల అనుమతులు తీసుకున్న అనంతరం గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి చెట్ల విక్రయానికి నిర్ణయం తీసుకుంది. సుమారు 150 చెట్లను రూ.1.70 లక్షలకు విక్రయించి వచ్చిన నిధులను గ్రామాభివృద్ధి పనులకు వినియోగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అయితే ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న మరో వర్గం, చెట్లను సరైన అనుమతులు లేకుండానే విక్రయించి నరికివేశారని ఆరోపించింది. ఈ క్రమంలో బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, ఉపసర్పంచ్ తోడంగి కరుణాకర్‌తో పాటు పాలకవర్గ సభ్యులు గ్రామాభివృద్ధి అంశాలపై సమావేశమై చర్చిస్తుండగా, కొందరు వ్యక్తులు అక్కడికి చేరుకుని అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం.ఈ సందర్భంగా వాగ్వాదం తీవ్రరూపం దాల్చగా, సర్పంచ్‌పై దాడికి యత్నించారని పాలకవర్గ సభ్యులు ఆరోపించారు. అక్కడున్న సభ్యులు అడ్డుకోవడంతో పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు తెలిపారు. ఘటనతో గ్రామంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం సర్పంచ్ సునీత, ఆమె భర్త స్వామి దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమపై దాడికి పాల్పడటమే కాకుండా బెదిరింపులకు దిగారని, తమకు ప్రాణహాని ఉందని పేర్కొంటూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా, చెట్ల విక్రయం పూర్తిగా అధికారుల అనుమతులతోనే జరిగిందని సర్పంచ్, పాలకవర్గ సభ్యులు స్పష్టం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు ఫిర్యాదు స్వీకరించి విచారణ చేపట్టినట్లు సమాచారం.

# గద్దర్‌పై పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు సరికాదు

**కేసు నమోదు చేయాలంటూ ఫిర్యాదు**

**ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్‌లో అడ్వకేట్ల వినతి**

**తెలంగాణ ప్రజల మనోభావాలు దెబ్బతీశాయంటూ ఆరోపణ**

**హైదరాబాద్, జూన్ 3**

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇటీవల దివంగత ప్రజాకవి, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత గద్దర్ గురించి చేసిన వ్యాఖ్యలపై వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం అడ్వకేట్లు ఫిర్యాదు చేశారు. అడ్వకేట్లు ఫణీంద్ర భార్గవ్, రవికుమార్ వొద్యారపు సంయుక్తంగా సమర్పించిన ఫిర్యాదులో, పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు గద్దర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో విశిష్ట పాత్ర పోషించిన గద్దర్ వంటి మహనీయుడి గురించి అసత్య ప్రచారం చేయడం ప్రజల మనోభావాలను గాయపరిచిందని ఆరోపించారు.గద్దర్ దళిత సమాజానికి చెందిన గౌరవనీయ నాయకుడని, ఆయన ఇక లేని సమయంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అనుచితమని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల కారణంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నా



**ఎల్బీనగర్ ఠాణాలో ఫిర్యాదు చేసిన అడ్వకేట్ల దృశ్యం**

యని తెలిపారు.పవన్ కళ్యాణ్‌పై భారతీయ న్యాయ సంహిత (బిఎన్ ఎస్)లోని సంబంధిత సెక్షన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కూడా కేసు నమోదు చేసి సమగ్ర విచారణ జరపాలని ఫిర్యాదుదారులు పోలీసులను కోరారు.ఈ ఫిర్యాదుపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ప్రస్తుతం రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# వలసలకు మతం ఎక్కడిది..?

ప్రపంచంలోని ఎన్నో దేశాల్లో ఇప్పుడు ఒక నినాదం ఎక్కువగా వినిపిస్తోంది. ప్రధానపార్టీల్లో కొన్ని ఆ నినాదం చుట్టూనే రాజకీయాలను నడుపుతున్నాయి. ప్రజల్లో ఉద్వేగాలనూ శత్రుత్వ భావనలనూ రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన జనాకర్షక నాయకులందరూ ఆ నినాదమంత్రాన్నే జపించారు. అధికార పీఠాన్ని అందుకోటానికి తహతహలాడుతున్న నేతలూ అదే అస్త్రాన్ని ఉపయోగిస్తున్నారు. అక్రమ వలసదారులను దేశం నుంచి తరిమికొడతామన్నదే ఆ నినాదం. వ్యక్తీకరణలో ఎన్ని తేడాలైనా ఉండొచ్చు.. కానీ సారాంశంలో మాత్రం వలసదారుల లక్ష్యంగానే రాజకీయ ప్రచారం ఊపందుకుంటోంది. దీనికి ఏ ప్రజాస్వామ్యదేశమూ మినహాయింపు కాదు. అన్ని ప్రజాస్వామ్య దేశాలకూ బయట నుంచి వచ్చే వలసల సమస్య తీవ్రమవుతూ ఉంది. దీన్ని కాదనలేం. ఉద్యోగాలు, ఉపాధికోసం వచ్చే సక్రమ వలసలను బాగా తగ్గించాలనే డిమాండు ఒకవైపు ఉంటే అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపాలనే లక్ష్యం కొన్నిచోట్ల విపరీత పోకడలు పోతోంది. అమానవీయంగా తయారవుతోంది. ఇటీవల జరిగిన బెంగాల్, అసాం అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమ వలసల సమస్యే బీజేపీకి ప్రధాన ప్రచార ఆయుధంగా మారింది. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వస్తోన్న ముస్లింలతో బెంగాల్, అసాంల్లో జనాభా ముఖచిత్రం మారిపోతోందన్న ప్రచారానికే అది పరిమితం అవ్వలేదు. దేశంలోని ఇతర ప్రాంతాల్లోకీ అక్రమ వలసదారులు చొచ్చుకుపోతు న్నారనీ అనేకచోట్ల స్థానికుల ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తున్నారనీ ఆరోపించింది. ఇతర ఈశాన్య రాష్ట్రాల్లో కూడా ఈ సమస్య ఉత్పన్నమవుతోందనీ సాక్షాత్తూ కేంద్ర హోంశాఖామంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ సమస్యకు పరిష్కారం కనుక్కోటానికి మే 26న ఒక ఉన్నత స్థాయి కమిటీని (హైలెవల్ కమిటీ ఆన్ డెమొగ్రాఫిక్ చేంజ్) కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఒక సంవత్సరంలోపు నివేదికను ఇవ్వాలని ఆ కమిటీకి నిర్దేశించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ప్రకాశ్ ప్రభాకర్ నావ్లేకర్ చైర్మన్‌గా ఏర్పాటైన ఆ కమిటీలో మరో నలుగురు సభ్యులు ఉన్నారు. అందులో భారత జనగణన కమిషనర్ కూడా ఒకరు. విచిత్రం ఏమిటంటే కమిటీ చైర్మన్‌కు జనాభాలో వచ్చే అనేక రకాల మార్పులను శాస్త్రీయంగా అధ్యయనం చేసే డెమొగ్రఫీ వ్యవహారంతో అంతకుముందు పెద్దగా పరిచయం లేదు. మధ్యప్రదేశ్‌లో విశ్రాంత జీవితాన్ని గడుపుతున్న తనను ఉన్నతస్థాయి కమిటీకి చైర్మన్‌గా ప్రకటించటం ఆశ్చర్యం కలిగించిందని ఆయన వ్యాఖ్యానించినట్లు 'ద హిందూ' పత్రిక పేర్కొంది. కమిటీలో ఉన్న మిగతా ముగ్గురు కూడా (జనగణన కమిషనర్ మినహా) జనాభా అధ్యయన శాస్త్రంలో జాతీయస్థాయిలోనూ అంత పేరు ప్రఖ్యాతులు ఉన్నవారేమీ కాదు. పొట్టచేతపట్టుకుని సరిహద్దులను దాటుకుని వచ్చి కూలీనాలీ చేసుకోవటం ఈనాటి సమస్య కాదు. స్వాతంత్ర్యానికి ముందు నుంచీ ఉంది. ఉమ్మడి బెంగాల్ రాష్ట్రం నుంచి అసాంలోకి ముస్లింల వలసలను బ్రిటిష్ పాలకులు బాగా ప్రోత్సహించారు. అంతకుముందు అసాం రాజులూ ఆ పనిని చేశారు. ఇక స్వాతంత్ర్యానంతరం తూర్పుబెంగాల్‌లో ఆర్థిక పరిస్థితులు అస్తవ్యస్తం అయినప్పుడల్లా ఉపాధికోసం భారత భూభాగంలోకి ప్రజలు వలసలు రావటం సర్వసాధారణంగా మారింది. ఆ వలసలు బంగ్లాదేశ్ యుద్ధమప్పుడు ఇంకా ఉధృతం అయ్యాయి. ఆ తర్వాతా కొనసాగాయి. వలసలూ ఇతర కారణాలతో క్రమేపీ ముస్లిం జనాభా పెరగటం అసాం మధ్యతరగతిలో తీవ్ర అభద్రతా భావాన్ని సృష్టించింది. అసాం విద్యార్థుల సంఘం నేతృత్వంలో బెంగాలీయులకు వ్యతిరేకంగా అక్కడ ఉద్యమం వచ్చింది. ఆ ఉద్యమం ఎన్నో ఆటుపోట్లకు లోనైనా చివరకు వలసప్రజల విషయంలో ఒక ఒప్పందానికి దారితీసింది. 1985 ఆగస్టు 15న కుదిరిన ఆ ఒప్పందం ప్రకారం... 1971 మార్చి 24 అర్ధరాత్రి తర్వాత దేశంలోకి ప్రవేశించిన వారందరినీ అక్రమ వలసదారులుగా ప్రకటించి ఓటర్ల జాబితా నుంచి వాళ్ల పేర్లను తొలగించాలి. ఒప్పందం కుదిరి 40 ఏళ్లు గడిచిపోయింది. ఇప్పటికీ ఆ సమస్యకు పరిష్కారం లభించలేదు. 1971 మార్చి 24 అర్ధరాత్రి నాటికి అసాంలో అర్హులైన పౌరులనూ వారి వారసులనూ గుర్తించి నేషనల్ రిజిస్ట్రేషన్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్ఆర్‌సీ) నవీకరించటం 2019లోనే పూర్తయినా దాన్ని ఇంకా నోటిఫై చేయలేదు. ఎన్నో వివాదాలు, అభ్యంతరాలతో ట్రైబ్యునళ్లు, కోర్టుల్లో కేసులు నమోదయ్యాయి. అక్రమ వలసదారులందరూ ముస్లింలేనని విపరీతంగా ప్రచారం జరిగినా ఎన్ఆర్‌సీ కసరత్తులో అది నిజం కాదని తేలింది. ఎన్ఆర్‌సీలో చోటుదక్కని ప్రజల సంఖ్య 19.06 లక్షలని నిర్ధారించారు. దాని ప్రకారం అక్రమ వలసదారులు అసాంలో అంతమంది మాత్రమే ఉన్నట్లు లెక్క. మిగతా 3.11 కోట్ల మంది అసాం స్థానికులే. 1,600 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి చేసిన కసరత్తులో తేలిన నిజం అదే. అక్రమ వలసదారుల్లో ఏ మతం వారు ఎంతమంది ఉన్నారో ఎన్ఆర్‌సీ తుదిజాబితాలో అధికారికంగా పేర్కొనలేదు. అనధికారిక అంచనాల ప్రకారం హిందువులే ఆ జాబితాలో ఎక్కువగా ఉన్నారు. బంగ్లాదేశ్ నుంచి హిందువులు వలసలు రావటం ఎప్పుడూ ఉంది. అన్ని పత్రాలూ పుచ్చుకుని వలసలు వచ్చే పరిస్థితి భారత ఉపఖండంలోనే కాదు, ప్రపంచంలోనే ఎక్కడా లేదు. అక్రమ వలసదారుల్లో హిందువులు ఎక్కువగా ఉండటానికి ప్రధానకారణం బంగ్లాదేశ్‌లో వారి సంఖ్య గతంలోనూ ఇప్పటికీ అధికంగానే ఉంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, 1.3 కోట్ల మంది హిందువులు బంగ్లాదేశ్‌లో ఉన్నారు. బంగ్లాదేశ్ జనాభాలో హిందువుల శాతంలో తగ్గుదల ఉన్నా సంఖ్యాపరంగా చూస్తే పెరుగుదలే కనిపిస్తుంది. 1951లో 92 లక్షల హిందూ జనాభా ఉంటే, ఇప్పుడది 1.3 కోట్లు అయింది. అసాం ఒప్పందం ప్రకారం అక్రమ వలసదారులను మతపరంగా విభజించి చూడటానికి వీల్లేదు. 1971 మార్చి 24 అర్ధరాత్రి తర్వాత దేశంలో కాలుపెట్టిన వాళ్లందరినీ అక్రమ వలసదారులుగానే భావించాలి. హిందువుల కూ ముస్లింలకూ ఇదే సూత్రాన్ని వర్తింపచేయాలి. ఎన్ఆర్‌సీ ప్రకారం అక్రమ వలసదారుల్లో హిందువులు అధికంగా ఉన్నట్లు స్పష్టంగా తేలటంతో కేంద్ర ప్రభుత్వం అసాం ఒప్పందానికి విరుద్ధంగా అడుగులు వేసింది. ముస్లింలను పక్కనబెట్టి హిందువులకూ మరో అయిదు మతవర్గాల వారికి మాత్రమే పౌరసత్వం కల్పించటానికి పౌరసత్వ చట్టానికి సవరణను తీసుకువచ్చింది. ముస్లింలు తరలిపోటానికి చాలా దేశాలు ఉన్నాయనీ హిందువులకు అట్లాంటి అవకాశం లేదనీ వారికి ఉన్నదల్లా ఒక్క భారతేనన్న విచిత్ర వాదనతో చట్ట సవరణను సమర్థించుకుంది.

# నేరాల అదుపుకు సిసి కెమెరాల పాత్ర కీలకం

**ఏసీపీ కిరణ్ కుమార్**



**రామకృష్ణాపూర్, జూన్ 03, (మన సమాజం):**

నేరాలను అదుపు చేయడానికి సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ అన్నారు.మున్సిపాలిటీ, పోలీస్ శాఖలు సంయుక్తంగా పోలీస్ స్టేషన్ పరిధిలో 59 కెమెరాలను ఏర్పాటు చేసిన సందర్భంగా ఆ శాఖలను ఎసిపి కిరణ్ కుమార్ అభినందించారు. అనంతరం పోలీస్ స్టేషన్ లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని పలు కాలనీలు,ప్రధాన కూడళ్ళు, రహదారులపై, కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతి కెమెరా పోలీస్ స్టేషన్ కి అనుసంధానంగా ఉంటుందన్నారు. పోలీస్ అధికారి ఎప్పటికప్పుడు పోలీస్ స్టేషన్ లో కెమెరాలను పర్యవేక్షించడం ద్వారా ట్రాఫిక్ సమస్యలు, నేరాల నియంత్రణ, ఇతర సమస్యలను పరిష్కరించడం సులభతరం అవుతుందని పేర్కొన్నారు. కెమెరాల ఏర్పాటుకు కృషిచేసిన మందమర్రి సిఐ రమేష్, పట్టణ ఎస్సై శ్రీధర్ లను ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో దుప్పట్ల దొంగలు..

**- సూపరింటెండెంట్ సాయంతోనే సిబ్బంది మాయం చేస్తున్నారనే ఆరోపణలు**

**- చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్**





**మన సమాజం/చెన్నూరు:**

రోగుల సౌకర్యార్థం ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్న దుప్పట్లను ఆసుపత్రి సిబ్బందే మాయం చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆది నుండి చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి ప్రభుత్వం నుండి వస్తున్న దుప్పట్లను సూపరిండెంట్ సిబ్బంది ద్వారా పక్కదారి పట్టిస్తూ, ప్రయివేట్ ఆసుపత్రులకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని, ఉన్నతమైన స్థానంలో ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇలాంటి చిల్లర వ్యవహారాలు నిర్వహించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనారోగ్యంతో ఆసుపత్రికి వస్తున్న రోగులు బెడ్లపై దుప్పట్లు లేక అవస్థలు పడుతున్నా వారి ఇబ్బందులను పట్టించుకోకుండా దానార్జనే ధ్యేయంగా దుప్పట్లను అమ్ముకోవడం సమంజసం కాదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిపై దృష్టి సారించి దుప్పట్లను మాయం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# మహాలక్ష్మి స్మార్ట్ కార్డులు త్వరలో

**ఉచిత బస్సు ప్రయాణానికి కొత్త విధానం.. పైలట్ ప్రాజెక్టుగా మండలం ఎంపిక**

**దుబ్బాక టౌన్, జూన్ 3 త**




మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని మరింత సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు స్మార్ట్ కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది. పథకంలో పారదర్శకత పెంచడం తో పాటు కండక్టర్లపై టికెటింగ్ భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. తొలిదశలో పైలట్ ప్రాజెక్టుగా ఒక మండలాన్ని ఎంపిక చేసి స్మార్ట్ కార్డుల పంపిణీ చేపట్టనున్నారు. సాంకేతిక అంశాలను పరిశీలించిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన మహిళలకు కార్డులు అందజేయనున్నారు. స్మార్ట్ కార్డు కోసం మహిళలు డిపోలు, మీ సేవ కేంద్రాలు లేదా ఆర్టీసీ సేవా కేంద్రాల్లో రూ.50 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే కార్డులు అందుబాటులోకి వచ్చే వరకు ప్రస్తుతం మాదిరిగానే ఆధార్ కార్డు చూపించి ఉచిత ప్రయాణం కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు. 2023లో ప్రారంభమైన మహాలక్ష్మి పథకం ద్వారా కోట్లాది మంది మహిళలు, విద్యార్థినులు, ట్రాన్స్‌జెండర్లు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. స్మార్ట్ కార్డుల ద్వారా టికెటింగ్ ప్రక్రియ వేగవంతమై పారదర్శకత మరింత పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

# వడగాల్పులతో వేల మరణాలు

◆ ఉత్తరప్రదేశ్‌లో తీవ్ర ప్రభావం ◆ దేశవ్యాప్తంగా ఆందోళనకర పరిస్థితి ◆ ఎండల తీవ్రతపై హెచ్చరికలు





**లక్నో, జూన్ 3 :**
దేశంలోని పలు రాష్ట్రాలను తీవ్ర వడగాల్పులు అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో ఎండల తీవ్రత కారణంగా పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. గత ఐదు రోజుల వ్యవధిలో రాష్ట్రంలో ఎనిమిది వేలకుపైగా మంది ప్రాణాలు కోల్పోయి ఉండవచ్చని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి. దీంతో ఈ వేసవిలో అత్యధిక ప్రభావం ఎదుర్కొన్న రాష్ట్రంగా ఉత్తరప్రదేశ్ నిలిచినట్లు తెలుస్తోంది. వడగాల్పుల ప్రభావం ఉత్తరప్రదేశ్‌కే పరిమితం కాకుండా బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలపై కూడా తీవ్రంగా పడింది. బీహార్‌లో మూడు వేల ఆరు వందలకు పైగా, మధ్యప్రదేశ్‌లో దాదాపు మూడు వేల మంది, రాజస్థాన్‌లో రెండువేల ఆరు వందలకు పైగా మరణాలు సంభవించి ఉండవచ్చని అధ్యయనం పేర్కొంది. ఈ గణాంకాలు ఎండల తీవ్రత ఎంత ప్రమాదకర స్థాయికి చేరుకుందో తెలియజేస్తున్నాయి. దేశవ్యాప్తంగా గత ఐదు రోజులలోనే దాదాపు ముప్పై వేల మంది వరకు ప్రాణాలు కోల్పోయి ఉండవచ్చని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఉత్తర, మధ్య భారత రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని దాటిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారిపై ప్రభావం ఎక్కువగా కనిపిస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలు కలిసి దేశ జనాభాలో నలభై మూడు శాతం వాటాను మాత్రమే కలిగి ఉన్నప్పటికీ, వడగాల్పుల కారణంగా సంభవించిన మరణాల్లో అరవై శాతానికి పైగా ఈ రాష్ట్రాల్లోనే నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. వాతావరణ మార్పుల ప్రభావం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ఈ పరిస్థితులకు ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లవద్దని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. తగినంత నీరు తాగడం, శరీరాన్ని చల్లగా ఉంచుకోవడం, వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం అవసరమని చెబుతున్నారు. ప్రభుత్వాలు కూడా అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు అందిస్తున్నాయి. వడగాల్పుల తీవ్రత రానున్న రోజుల్లో కూడా కొనసాగవచ్చని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ఎండల ప్రభావాన్ని తక్కువ అంచనా వేయకుండా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# తెలంగాణకు ఓజీ కేసీఆర్..
# వేరే ఎవరూ అవసరం లేదు: కేటీఆర్

**హైదరాబాద్, జూన్ 3:**
ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ కచ్చితంగా ఇక్కడి భూమి పుత్రుల జాగీరే అని స్పష్టం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌ను గౌరవిస్తామని.. సోదరుడిగా ఇంటికి వస్తే.. హైదరాబాద్ బిర్యానీ పెడతామన్నారు. అంతే కానీ.. తమ సచివాలయంలో కూర్చుంటామంటే కుదరదన్నారు. బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణకు ూ+ కేసీఆర్ అని.. వేరే ఎవరూ అవసరం లేదన్నారు. 'పవన్ కళ్యాణ్.. మీరు ఇక్కడకి రండి.. మీ కుటుంబాలు, వ్యాపారాలు ఇక్కడే ఉన్నాయి. ప్రాంతాలుగా విడిపోయినా.. ప్రజలుగా కలిసి ఉండాలని కోరుకున్నాం. ప్రాంతీయవాదం ఉగ్రవాదంతో సమానమని పవన్ అన్నారు. మద్రాసు నుంచి ఆంధ్ర వేరు పడాలని పొట్టి శ్రీరాములు పోరాడారు. అది కూడా ప్రాంతీయవాదమే అంటారా? మోదీ తన ప్రాంతీయవాదంతో.. తెలంగాణకు వచ్చిన పరిశ్రమలను తరలించుకుపోతు న్నారు. జాతీయవాదం ముసుగులో ఆర్థిక పాంత్రీయవాదం చేయటం సరైందేనా? దీనికి పవన్ కల్యాణ్ సమాధానం చెప్తారా' అని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణలో జనసేన కొత్తగా చేసేదేముందని కేటీఆర్ అన్నారు. దేశభక్తి గురించి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. 2023 ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో కూడా జనసేన పోటీ చేసిందని గుర్తుచేశారు. 2018లో చంద్రబాబు కూడా పోటీ చేశారని తెలిపారు. 'పవన్.. తెలంగాణలో పోటీ చేయండి.. ఎవరు వద్దంటున్నారు. ఇక్కడకు వచ్చి అనాయాసంగా మాట్లాడటం సరికాదు. నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కదం తొక్కిన నేల ఇది. ఆవిర్భావ దినోత్సవం రోజు విభజన తీరు సరిగా లేదని అంటున్నారు. తెలంగాణపై ఉల్టాపల్టా మాటలెందుకు? తెలంగాణ ఏర్పడినప్పుడు 11 రోజులు అన్నం తినలేదని చెప్పారు. తెలంగాణ ఆవిర్భావం రోజు పవన్ సభ పెడతానంటే ఎలా. పవన్ మీటింగ్‌ను అడ్డుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వం' అని తెలిపారు. వందల మంది బలిదానాల రక్తంతో తడిసిన నేల తెలంగాణ అని మాజీ మంత్రి అన్నారు. ఒకటికి రెండు సార్లు ఆలోచించి పవన్ మాట్లాడాలని హితవుపలికారు. ఈ దేశంలో ఎవరైనా ఎక్కడైనా పోటీ చేయొచ్చని తెలిపారు. ఎక్కడైతే పోటీ చేయాలనుకుంటున్నారో ఆ ప్రాంత ప్రజల మనోభావాలు తెలుసుకోవాలని కేటీఆర్ సూచించారు. పోరాటాలు, త్యాగాలు, బలిదానాలతో



తెలంగాణ సాకారమైందని కేటీఆర్ అన్నారు. 1956లో బలవంతంగా ఆంధ్ర, తెలంగాణను కలిపింది కాంగ్రెస్ అని విమర్శించారు. 1969 ఉద్యమంలో 379 మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమాలను కర్కశంగా అణిచివేసింది కాంగ్రెస్ అని విరుచుకుపడ్డారు. మలిదశ ఉద్యమంలో వేలాది మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని అన్నారు. తెలంగాణ కథలో నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్సే అని.. తప్పుని పరిస్థితుల్లో కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పోరాటం, దీక్ష లేకపోతే.. తెలంగాణ వచ్చేది కాదన్నారు. కేసీఆర్ హయాంలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలోనూ జరగలేదని మాజీ మంత్రి అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా అని సవాల్ విసిరారు. అమలుకాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ చేసిందేంటి అని ప్రశ్నించారు. అప్పులు చేయడంలో రేవంత్ ప్రభుత్వం రికార్డ్ సృష్టిస్తోందని అన్నారు. రెండున్నరేళ్లలో రేవంత్ ప్రభుత్వం రూ.4లక్షల కోట్ల అప్పులు చేసిందని తెలిపారు. అప్పులపై ఒక్కో మంత్రి.. ఒక్కో లెక్క చెబుతున్నారన్నారు. కరోనా కంటే కాంగ్రెస్ ప్రమాదమని ప్రజలకు అర్థమైందని కేటీఆర్ పేర్కొన్నారు.

## తెలంగాణ ఇన్-సర్వీస్ టీచర్లకు గుడ్ న్యూస్..
# ప్రత్యేక టెట్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, జూన్ 03:**
తెలంగాణ రాష్ట్రంలో సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు రేవంత్ సర్కార్ తీపి కబురు అందించింది. రాష్ట్రంలోని ఇన్-సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేక ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సాధారణంగా ప్రతి ఏటా నిర్వహించే రెండు టెట్ పరీక్షలకు అదనంగా.. మరో రెండు ప్రత్యేక టెట్ పరీక్షలను నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. పూర్తిగా సర్వీసులో ఉన్న ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసమే ఈ ప్రత్యేక టెట్ పరీక్షలను ప్రభుత్వం తలపెట్టింది. గత కొంతకాలంగా ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం.. ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రత్యేక టెట్ నిర్వహణకు సంబంధించి అధికారిక ఉత్తర్వులను కూడా జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో.. ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి తదుపరి



అవసరమైన అన్ని చర్యలనూ తక్షణమే చేపట్టాలని విద్యాశాఖ డైరెక్టర్‌కు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## భూముల మార్కెట్ విలువల సవరణకు
# తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్




**హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం భూములు, ప్లాట్లు, ఫ్లాట్ల మార్కెట్ విలువల సవరణకు ఆమోదం తెలిపింది. కొత్త మార్కెట్ విలువలు ఈ నెల 5వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్ల ధోరణి, డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలోని 144 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల మార్కెట్ విలువలు పెరిగాయి. ఔటర్ రింగ్ రోడ్ రీజినల్ రింగ్ రోడ్, అభివృద్ధి కారిడార్లు వంటి ప్రాజెక్టుల ప్రభావాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఈ ప్రాంతాల్లో భూముల విలువలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో మార్కెట్ విలువలను సవరించింది. ఫ్లాట్ల మార్కెట్ విలువల్లో ఉన్న అసమానతలను తొలగించేందుకు హేతుబద్ధీకరణ చేపట్టింది. కొన్ని ప్రాంతాల్లో అన్ని అంతస్తుల ఫ్లాట్లకు ఒకే మార్కెట్ విలువను అమలు చేయాలని నిర్ణయించింది. అలాగే ఎవీణూ, ఇతర ప్రాంతాలకు కనీస ప్రాథమిక మార్కెట్ రేట్లను నిర్ణయించింది. వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు కొత్త కనీస మార్కెట్ విలువలను ఖరారు చేయడంతో పాటు నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ రేట్లను కూడా సవరించింది. ఆర్‌సీసీ, నాన్-ఆర్‌సీసీ నిర్మాణాలకు సంబంధించిన విలువల్లో మార్పులు చేసింది. భూ లావాదేవీల్లో పారదర్శకతను పెంచడం, మార్కెట్ ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలను నిర్ణయించడం ఈ సవరణల ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

## భూమి సమస్యతో సెక్రటేరియట్
## వద్ద దంపతుల ఆత్మహత్యాయత్నం




**హైదరాబాద్, జూన్ 3**
తెలంగాణ సెక్రటేరియట్ వద్ద బుధవారంఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తమ భూమి సమస్యకు న్యాయం చేయాలని కోరుతూ వచ్చిన ఓ దంపతులు సెక్రటేరియట్ ప్రధాన ద్వారం సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కొండా పోచమ్మపల్లి గ్రామానికి చెందిన పుట్ట కృష్ణయ్య, ఆయన భార్య సైదమ్మ తమ భూమికి సంబంధించిన సమస్యపై న్యాయం కోసం గత మూడు రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే తమ వినతిని ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో దంపతులు పెట్రోల్ డబ్బాతో సెక్రటేరియట్ వద్దకు చేరుకుని ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. అక్కడ భద్రతా విధుల్లో ఉన్న ఎస్పీఎఫ్ (ఖాకీ) పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. దంపతుల చేతిలో ఉన్న పెట్రోల్ డబ్బాను లాక్కొని వారిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. తర్వాత దంపతులను విచారణ నిమిత్తం సైఫాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. వారి భూమి సమస్యకు సంబంధించిన వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

## హైదరాబాద్‌లో నకిలీ ఐఏఎస్ ముఠా అరెస్ట్



**హైదరాబాద్, జూన్ 3:** హైదరాబాద్‌లో నకిలీ ఐఏఎస్ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఓ కానిస్టేబుల్ ద్వారా 6 మంది టీంతో ముఠా ఏర్పడినట్లు పోలీసులు తెలిపారు. ఐఏఎస్ అధికారులమంటూ పూర్ణచంద్రరావు అనే వ్యక్తిని ఈ ముఠా బెదిరించింది. ఫేక్ పోలీస్ కార్‌లో పూర్ణచంద్రరావును సూర్యాపేటకు తీసుకెళ్లి దాదాపు రూ.6.26 లక్షల నగదును వసూలు చేసినట్లు సమాచారం. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. ఎట్టకేలకు నిందితులను పట్టుకున్నారు. ప్రధాన నిందితుడు నాగరాజ్‌తో పాటు మరో ముగ్గురు అరెస్ట్ అయ్యారు. మిగిలిన నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రధాన నిందితుడు నాగరాజుపై రెండు పీడీయాక్ట్‌లు, 12 కేసులు ఉన్నట్లు గుర్తించారు. నిందితుల నుంచి రెండు గన్స్, ల్యాప్‌టాప్‌లు, రబ్బర్ స్టాంపులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



## ఇప్పటివరకూ రాని కథ!

లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహిస్తున్న సంగీతప్రధాన చిత్రం 'సింగ్ గీతం'. ప్రముఖ దర్శకుడు నాగ్అశ్విన్ నిర్మిస్తున్నారు. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండెపూడి ప్రధాన పాత్రధారులు. ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం చిత్ర కథానాయిక అహల్యా బమ్రూ విలేకరులతో ముచ్చటించింది. తన నేపథ్యం గురించి చెబుతూ 'మాది పుదుచ్చేరి. ఇంగ్లీష్, ఫ్రెంచ్, బెంగాలీ భాషలు మాట్లాడే ఓ ఇంటర్నేషనల్ కమ్యూనిటీలో పెరిగాను. నా ఇన్‌స్టాగ్రామ్ కంటెంట్ చూసి నాగ్అశ్విన్ సినిమాలో అవకాశం ఇచ్చారు. ఆడిషన్ కూడా ఇన్‌స్టాగ్రామ్ ద్వారానే ఇచ్చాను' అని చెప్పింది. ఈ సినిమాలో తాను బలమైన వ్యక్తిత్వం ఉన్న అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, ఇందులో విలన్ క్యారెక్టర్‌లో కూడా అమ్మాయే నటించిందని తెలిపింది. 'కథాపరంగా కూడా ఇది కొత్త జోనర్ సినిమా. ఇలాంటి కథను ఇంతవరకు చూసి ఉండరు. తెలుగు ఇండస్ట్రీలో పనిచేయడం ఆనందంగా ఉంది. మహేష్‌బాబు నా ఫేవరేట్ హీరో. యాక్షన్ సినిమాలు చేయాలన్నది నా డ్రీమ్' అని అహల్యా బమ్రూ చెప్పింది.

### లీగల్ నోటీసుల వార్తలపై జాకీ భగ్నానీ క్లారిటీ..

## అవన్నీ పుకార్లేనంటూ కామెంట్



బాలీవుడ్ నటుడు, నిర్మాత జాకీ భగ్నానీ తన కుటుంబ నిర్మాణ సంస్థ పూజా ఎంటర్‌టైన్‌మెంట్‌పై వస్తున్న లీగల్ వివాదాల వార్తలకు స్పష్టత ఇచ్చారు. ప్రముఖ మల్టీప్లెక్స్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ తమ సంస్థపై, అలాగే తన తండ్రి వాషు భగ్నానీపై చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతోందంటూ మీడియాలో వస్తున్న కథనాలను ఆయన పూర్తిగా ఖండించారు. సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన అధికారిక ప్రకటనలో ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని తెలిపారు. గత కొద్ది రోజులుగా పీవీఆర్ ఐనాక్స్ మరియు పూజా ఎంటర్‌టైన్‌మెంట్ మధ్య ఆర్థిక వివాదం నడుస్తోందని వార్తలు వైరల్ అయ్యాయి. ముఖ్యంగా 'మిషన్ రాణిగంజ్', 'గణపత్', 'బడే మియాన్ ఛోటే మియాన్' చిత్రాల థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ ఒప్పందాల విషయంలో భారీ బకాయిలు ఉన్నాయని, దాదాపు రూ.50 కోట్లకు పైగా ఆర్థిక లావాదేవీలు పెండింగ్‌లో ఉన్నాయనే ప్రచారం జరిగింది. ఈ వివాద పరిష్కారం కోసం ముంబైలోని కొన్ని విలువైన ఆస్తుల విషయంలో కూడా చర్చలు జరిగాయని, సమస్య పరిష్కారం కాకపోతే కోర్టు వరకు వెళ్లే అవకాశం ఉందని కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ వార్తలను పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ కూడా ఖండించింది. భగ్నానీ కుటుంబంతో తమకు ఎన్నో సంవత్సరాలుగా సత్సంబంధాలు ఉన్నాయని సంస్థ స్పష్టం చేసింది. మీడియాలో వస్తున్న కథనాలు వాస్తవాలను వక్రీకరిస్తున్నాయని పేర్కొంది. వ్యాపార పరమైన అంశాలు పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకునే విషయాలని, వాటిని బహిరంగంగా చర్చించాల్సిన అవసరం లేదని తెలిపింది. అలాగే ఈ వ్యవహారాలను జాకీ భగ్నానీ ఎంతో వృత్తిపరమైన నిబద్ధతతో నిర్వహిస్తున్నారని ప్రశంసించింది. ఇదిలా ఉండగా, పూజా ఎంటర్‌టైన్‌మెంట్ ప్రస్తుతం మరో కీలక న్యాయపోరాటంతో కూడా వార్తల్లో నిలిచింది. దర్శకుడు డేవిడ్ ధావన్ తెరకెక్కిస్తున్న 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' చిత్రానికి సంబంధించిన మ్యూజిక్ హక్కుల వివాదంపై సంస్థ బాంబే హైకోర్టును ఆశ్రయించింది. తమ 1999 సూపర్ హిట్ చిత్రం 'బీవీ నెం.1' లోని ప్రసిద్ధ గీతాలు 'చునరీ చునరీ', 'ఇష్క్ సోనా హై' పాటలను సరైన అనుమతులు లేకుండా కొత్త సినిమాలో వినియోగించారని ఆరోపిస్తూ టిప్స్ ఇండస్ట్రీస్, నిర్మాత రమేష్ తౌరానీ, దర్శకుడు డేవిడ్ ధావన్‌లపై రూ.400 కోట్ల నష్టపరిహారం కోరుతూ దావా వేసింది. వరుణ్ ధావన్, పూజా హెగ్డే, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం జూన్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇలాంటి సమయంలో తప్పుడు వార్తలతో తమ సంస్థ ప్రతిష్టను దెబ్బతీయవద్దని జాకీ భగ్నానీ విజ్ఞప్తి చేశారు.

## గండికోటలో 'రణబాలి'



అగ్ర హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న పీరియాడిక్ చిత్రం 'రణబాలి' శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది.రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. రష్మిక మందన్న కథానాయిక. రాయలసీమ నేపథ్యంలో జరిగే ఈ కథలో విజయ్ దేవరకొండ 19వ శతాబ్దం నాటి చారిత్రక యోధుడి పాత్రలో కనిపించనున్నారు. బ్రిటీష్ ప్రభుత్వం అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడే యోధుడిగా ఆయన పాత్ర అత్యంత శక్తివంతంగా సాగుతుందని చెబుతున్నారు. ఈ సినిమా కోసం విజయ్ దేవరకొండ గుర్రపుస్వారీలో ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ఏపీలోని వైఎస్ఆర్ కడప జిల్లా గండికోటలో జరుగుతున్నది. కోట ముఖద్వారం, ధాన్యాగారంలో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. మరోవారం రోజుల పాటు అక్కడే షూటింగ్ జరుగుతుందని తెలిసింది. 'రణబాలి' సెప్టెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది.

# మళ్లీ పెళ్లి పీటలెక్కనున్న ఆమిర్ ఖాన్..

## హాజరుకానున్న సల్మాన్, షారుఖ్!



బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ మరోసారి కొత్త జీవితాన్ని ప్రారంభించబోతున్నారు. 61 ఏళ్ల ఆమిర్ తన భాగస్వామి, 47 ఏళ్ల గౌరీ స్ప్రాట్‌ను జులై 5న వివాహం చేసుకోబోతున్నట్లు సమాచారం. ముంబైలోని ఆమిర్ నివాసంలో అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ వేడుక చాలా సైలెంట్‌గా, ప్రైవేట్ రిజిస్టర్ మ్యారేజ్ రూపంలో జరగబోతుంది. తమ బంధాన్ని అధికారికం చేసుకోవాలని ఈ జంట ఇటీవలనే నిర్ణయించుకుందని, ఇరు కుటుంబాల మద్దతుతో ఇప్పటికే వివాహ ఏర్పాట్లు కూడా ప్రారంభమయ్యాయని వారి సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఎలాంటి హంగూ ఆర్భాటాలు లేకుండా కేవలం కుటుంబ సభ్యులు, కొద్దిమంది స్నేహితుల మధ్యే ఈ వేడుకను ముగించాలని వారు భావిస్తున్నారు. ఈ ప్రైవేట్ వివాహ వేడుకకు ఆమిర్ ఖాన్ మిత్రులైన బాలీవుడ్ సూపర్ స్టార్స్ సల్మాన్ ఖాన్, షారుఖ్ ఖాన్ కూడా హాజరయ్యే అవకాశం ఉందని బాలీవుడ్ వర్గాల్లో గట్టిగా ప్రచారం నడుస్తుంది. గౌరీ స్ప్రాట్‌కు గత వివాహం ద్వారా క్విన్ అనే ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. ఆమె తాతగారైన ఫిలిప్ స్ప్రాట్ బ్రిటన్ సంతతికి చెందిన కమ్యూనిస్ట్ కాగా, ఆయన 1920లలో భారతదేశానికి వచ్చి ఇక్కడి స్వాతంత్ర్య పోరాటంలో కూడా పాల్గొన్నారు. గత ఏడాది ముంబైలో జరిగిన తన ప్రీ-బర్త్‌డే వేడుకలో ఆమిర్ ఖాన్ మొదటిసారిగా గౌరీని మీడియాకు పరిచయం చేశారు. ఆమిర్ ఖాన్‌కు ఇది మూడో వివాహం కానుంది. ఆయనకు గతంలో రీనా దత్తాతో వివాహం జరగ్గా, వారికి జునైద్, ఇరా అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆ తర్వాత ఆయన దర్శకురాలు కిరణ్ రావును వివాహం చేసుకోగా, వారికి ఆజాద్ అనే కుమారుడు జన్మించాడు. ఆమిర్, కిరణ్ రావు జంట 2021లో తమ విడాకులను ప్రకటించారు. ఇప్పుడు జులై 5న జరగబోయే రిజిస్టర్ మ్యారేజ్ మరియు చిన్న ఫ్యామిలీ గెట్-టుగెదర్ ద్వారా ఆమిర్, గౌరీ తమ వైవాహిక జీవితాన్ని ప్రారంభించనున్నారు.

## గిరిజన విద్యార్థులను తాకకుండా చాక్లెట్లు పంచిన బీజేపీ ఎమ్మెల్యే.. నెటిజన్ల విమర్శలు

కేరళకు చెందిన బీజేపీ ఎమ్మెల్యే, మాజీ కేంద్ర మంత్రి వి. మురళీధరన్ చేసిన ఒక పని ప్రస్తుతం రాజకీయంగా తీవ్ర వివాదానికి దారితీసింది. కేరళలోని పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా తిరువనంతపురంలోని కట్టేల మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ అనే గిరిజన, వెనుకబడిన వర్గాల పిల్లలు చదివే పాఠశాలలో ఒక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వి. మురళీధరన్ విద్యార్థులకు చాక్లెట్లను నేరుగా వారి చేతులకు ఇవ్వకుండా, బెంచీలపై పెడుతూ, విసురుకుంటూ వెళ్లడం వివాదాస్పదమైంది. ముఖ్యంగా ఇందులో చాక్లెట్లు పంచేముందు ఒక చిన్నారి చేయిచాచగా.. బెంచ్‌పై మురళిధరన్ వేయడం పలువురికి ఆగ్రహానికి తెప్పించింది. ఇక దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ కావడంతో దళిత, గిరిజన సంఘాల నేతలు, సామాజిక విశ్లేషకులు మరియు ప్రతిపక్ష పార్టీల నాయకులు, నెటిజన్లు ఆయనపై తీవ్రంగా మండిపడుతున్నారు. విద్యార్థులను తాకకూడదనే ఉద్దేశంతోనే ఆయన అలా బెంచీలపై చాక్లెట్లు వేశారని, ఇది ముమ్మాటికీ కులాహంకారం, అంటరానితనం కిందకే వస్తుందని విమర్శకులు ఆరోపిస్తున్నారు. మనసులో మనుస్మృతి ఆలోచనలు ఉండటం వల్లే మనుషులను తాకడానికి ఇష్టపడట్లేదా అంటూ సీపీఐ(ఎం) ఎంపీ ఏఏ రహీమ్ కూడా దీనిపై తీవ్రంగా విమర్శలు



గుప్పించారు. కుక్కలకు అన్నం పెట్టినట్లుగా, పిల్లల ముందు చాక్లెట్లను విసిరేయడం వారి మానవ హక్కులను, ఆత్మగౌరవాన్ని భంగపరచడమేనని దళిత హక్కుల కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తూ, మురళీధరన్ ఆ గిరిజన పిల్లలకు మరియు కేరళ సమాజానికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని పలువురు మాజీ మంత్రులు, రాజకీయ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం కేరళ రాజకీయాల్లో పెద్ద దుమారమే రేపుతోంది.